నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

3 | కరీంనగర్, గురువారం 5 డిసెంబర్ 2024 | PEDDAPALLI

# భూకంప కలకలం

## ఉమ్మడి జిల్లాలో కొన్ని సెకన్లపాటు కంపించిన భూమి

- బెంబేలెత్తిన జనం.. ఇండ్ల నుంచి బయటికి పరుగులు
- అడవి శ్రీరాంపూర్‌లో కూలిన గోడ

మంథని/మంథని రూరల్, డిసెంబర్ 4: కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో బుధవారం భూకంప కలకలం రేగింది. ఉదయం 7.27 గంటల ప్రాంతంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు బెంబేలెత్తారు. ఇండ్లల్లో సామగ్రి కింద పడి శబ్దాలు రావడంతో ఏం జరిగిందో తెలియక భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. మొదట ఎవరికి వారు తమ ఇంట్లోనే ఇలా జరిగిందేమోనని భావించినా.. చుట్టు పక్కల వారు సైతం ఇదే విధంగా బయటికి రావడంతో చూసి భూకంపం వచ్చినట్టు గుర్తించారు. సింగరేణి ప్రాంతంలో ఓసీపీల్లో బొగ్గు నిల్వల తవ్వకాల కోసం చేపట్టే జిలెటిన్ స్టిక్స్ బ్లాస్టింగ్‌గా భావించారు. కానీ కొద్ది సేపటి ద్వారా టీవీ న్యూస్ చానళ్లు, సోషల్ మీడియాల ద్వారా పక్క గ్రామాలు, పక్క జిల్లాల్లో సైతం భూమి కంపించిందని తెలిసి ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ భూకంపం దృశ్యాలు పలుచోట్ల సీసీ కెమెరాల్లో రికార్డు కాగా, వాటిని చూసి భయాందోళన వ్యక్తం చేశారు. అయితే పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ తోట నారాయణకు చెందిన ఇంటి ప్రహరీ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లో కూలిన ఇంటి ప్రహరీ



ఖాళీ కుర్చీలు

యువ వికాసం సభకు ప్రజలను పెద్దసంఖ్యలో తరలించారు. అయితే వక్తల ఊకదంపుడు ఉపన్యాసాలతో జనం విసిగిపోయారు. సీఎం శంకుస్థాపనలు చేస్తుండగా వేదికపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతుండగానే వెనుదిరిగారు. సభ ముగిసే సమయానికి సగానికంటే ఎక్కువగా జనం వెనక్కి వెళ్లిపోయారు. డిప్యూటీ సీఎం ప్రసంగం ప్రారంభించే వరకే దాదాపు 30 శాతం కుర్చీలు ఖాళీ అయ్యాయి. సీఎం ప్రసంగించే సమయానికల్లా వెనుక ఉన్న గ్యాలరీలన్నీ బోసిపోయాయి.



ప్లకార్డులతో కార్మికుల పిల్లలు

సభలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రసంగిస్తుండగా రామగుండం నియోజకవర్గానికి చెందిన సుమారు 25 మంది సింగరేణి కార్మికుల పిల్లలు ఒక్కసారిగా నినాదాలు చేశారు. సింగరేణి కారుణ్య నియామకాల్లో డిపెండెంట్ ఉద్యోగ బాధితులమని, మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులు తొందరగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సింగరేణిలో మారు పేర్ల సమస్యను పరిష్కరించాలంటూ నినదించారు. దీంతో సభలో ఏదో జరుగుతున్నదని గ్రహించిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అక్కడికి చేరుకొని, వారిని శాంతింపజేశారు.



భరోసానివ్వని ముఖ్యమంత్రి పెద్దపల్లి పర్యటన

- అధికార వేదికపై మళ్లీ విమర్శలే
- నల్లసూర్యులకు ఇచ్చిన హామీల ప్రస్తావన లేకుండానే సభ ముగింపు
- కార్మికుల పిల్లలు నిరసన తెలిపినా స్పందన కరువు
- కాళేశ్వరంపై మళ్లీ అబద్ధాలే?
- ప్రసంగాలతో విసుగెత్తిన ప్రజలు
- సభ మధ్యలోనే ఇంటిబాట
- దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు

# సింగరేణి ముచ్చట మరిచిన సీఎం

కార్మికుల ఊసెత్తని రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసానిస్తారని వివిధ వర్గాల ప్రజలు ఎంతో ఆశగా చూసినా.. చివరకు నిరాశే మిగిలింది. ప్రజాపాలన-విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన 'యువ వికాసం సభ' భరోసా నింపలేకపోయింది. సభలో 47 నిమిషాల పాటు ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇచ్చిన హామీల అమలు గురించి, చేసిన అభివృద్ధి గురించి చెప్పకుండా, అధికార వేదికపై ఆద్యంతం రాజకీయ విమర్శలు చేయడంపై సభికుల్లో అసహనం వ్యక్తమైంది. సీఎం మళ్లీ అవే అబద్ధాలు చెప్పారన్న అభిప్రాయాలు వ్యక్తం కాగా, సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల ముచ్చటే లేకుండా సభ ముగించడంపై కార్మికలోకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. సింగరేణిలో మారు పేర్ల మార్పు సమస్యను పరిష్కరించాలని కార్మికుల పిల్లలు సభలో ప్లకార్డులు ప్రదర్శించినా పాలకుల నుంచి స్పందన కరువైంది. ఇటు నియామకపత్రాలు ఇస్తామని తీసుకొచ్చిన అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కరీంనగర్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ పెద్దపల్లి, (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులకు అసెంబ్లీ, సింగరేణి ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌తో పాటు దాని అనుబంధ కార్మిక సంస్థ ఐఎన్‌టీయూసీ అనేక హామీలు ఇచ్చింది. కార్మికలోకం అవి నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు వేసింది. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ హామీలు నెరవేరుతాయని ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి పెద్దపల్లికి రావడంతో తమకు తీపి కబురు చెబుతారని కార్మికులు ఆశించారు. కానీ, నిరాశే మిగిలింది. ఆదాయ పన్ను రద్దు చేసేందుకు కృషి చేస్తామని, సొంత ఇంటి పథకం కింద 250 గజాల జాగ ఇస్తామని, ఇల్లు కట్టుకునేందుకు ₹20 లక్షల వడ్డీలేని రుణం ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఇవే కాదు, కొత్త గనులు ప్రారంభించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామనే అనేక హామీలు ఇచ్చింది. వీటన్నింటిపై సీఎం క్లారిటీ ఇస్తారని కార్మికులు ఆశించినా, ఏ ఒక్క అంశాన్నీ ప్రస్తావించలేదు. కనీసం సింగరేణి ముచ్చటే ఎత్తలేదు. నిజానికి పెద్దపల్లి అంటేనే సింగరేణి గడ్డ. అటువంటిది ఇక్కడకు వచ్చి కనీసం మాట మాత్రం మాట్లాడకపోవడంపై కార్మికులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. అలాగే ఇతర మంత్రులు కూడా స్పందించకపోవడంపై మండిపడుతున్నారు. ఒక సందర్భంలో మంత్రి శ్రీధర్‌బాబు ఐటీ మినహాయింపు అంశాన్ని ప్రస్తావించినట్టు అనిపించినా అంతలోనే మాటమార్చారు. ఎటువంటి స్పష్టత ఇవ్వకుండా దాట వేశారు.

### కాళేశ్వరంపై అవే అబద్ధాలు

నిజానికి కాళేశ్వరం అంటే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మాత్రమే కాదని ముఖ్యమంత్రితో సహా వేదికపై ఉన్న ప్రతి ఒక్క మంత్రికి తెలిసినా.. అవే అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పనులు పెద్దపల్లి ప్రజల కండ్ల ముందే జరిగాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులను ఎలా పూర్తి చేసిందో ఇక్కడ అందరికీ తెలుసు. కానీ, ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా సీఎంతోపాటు మంత్రులు ఇష్టానుసారం మాట్లాడారు. ఒక మంత్రి లక్షా 25వేల కోట్లు నీళ్లలో పోశారని, మరో మంత్రి లక్ష కోట్లు ఖర్చు పెట్టారని, చివరకు ముఖ్యమంత్రి లక్షా రెండువేల కోట్లు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు పని చేయకపోయినా.. తాము రాష్ట్రంలో అధిక పంటలు పండించామంటూ నమ్మించే ప్రయత్నం చేశారు. కాళేశ్వరం పనిచేయకపోతే ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు, అక్కడి నుంచి కొండపోచమ్మ సాగర్‌కు గత జూన్‌లో 23 టీఎంసీలు ఎలా ఎత్తిపోశారో..? చెప్పాలన్న ప్రశ్నలు సభ వద్దే ఉత్పన్నమయ్యాయి. అంతేకాదు, లక్షా రెండు వేల కోట్లు మూడు బరాజ్‌లపై పెట్టారా..? లేక కాళేశ్వరం ఎత్తిపోతల కింద వివిధ లింకుల కింద చేపట్టిన పనులకు పెట్టారా..? అన్న దానిపై స్పష్టత ఇవ్వకుండా.. మూడు బరాజ్‌ల విషయాన్ని ఎత్తిచూపి, మరోసారి ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినట్టు కనిపించింది.



సింగరేణి కార్మికుల పిల్లలను అడ్డుకుంటున్న పోలీసులు



యువ వికాస సభలో అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# పెద్దపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- యువ వికాస సభకు హాజరైన సీఎం
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- గ్రూప్-4, సింగరేణి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

పెద్దపల్లి, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి, పెద్దపల్లి కమాన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం పెద్దపల్లి జిల్లాకేంద్రానికి వచ్చారు. ప్రజాపాలన-విజయోత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు అధ్యక్షతన నిర్వహించిన యువ వికాసం సభకు హాజరయ్యారు. సాయంత్రం 4గంటల తర్వాత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయ్యారు. అక్కడి నుంచి మంత్రులతో కలిసి కలెక్టరేట్ ఎదుట పెద్దకల్వల, రంగంపల్లి శివారులో ఏర్పాటు చేసిన సభా స్థలికి చేరుకున్నారు. సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ₹1,035 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సాయంత్రం 4.30గంటలకు వేదికపైకి చేరుకున్నారు. మంత్రుల ప్రసంగం అనంతరం స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం, డీఈఈటీ, రియల్‌టైం గవర్నెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం, సీఎం కప్ ఆవిష్కరణలు చేశారు. ఇటీవల గ్రూప్-4, సింగరేణి కొలువులు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం ముఖ్యమంత్రి 47 నిమిషాలపాటు ప్రసంగించారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఇంజినీరింగ్, లా కళాశాల మంజూరుకు ప్రయత్నంచేస్తామని చెప్పారు. మంథనిలో కోకోకోలా ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి 7.30గంటల తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, హర్కర్ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ గడ్డం వంశీ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.



గోదావరిఖనిలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



సభ ప్రారంభానికి ముందు అభ్యర్థుల పడిగాపులు

# ఆగని నిర్బంధం

- సీఎం పెద్దపల్లి టూర్ సందర్భంగా పోలీసుల నిర్బంధకాండ
- అర్ధరాత్రి నుంచే బీఆర్‌ఎస్, ఇతర పార్టీల నాయకుల అరెస్టులు

పెద్దపల్లి, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి/ పెద్దపల్లి కమాన్: ముఖ్యమంత్రి రేవంత్ పర్యటనల నేపథ్యంలో నిర్బంధం కొనసాగుతున్నది. సీఎం ఎక్కడికి వస్తున్నా.. ఒక రోజు ముందు నుంచే ప్రశ్నించే గొంతుకలపై అణిచివేత మొదలవుతున్నది. బుధవారం సీఎం పెద్దపల్లి టూర్ సందర్భంగా నాయకుల అరెస్టుల పర్వం సాగింది. ప్రధానంగా పెద్దపల్లి జిల్లాతోపాటు జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో బీఆర్‌ఎస్, ఇతర ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వ ప్రజావంచనకు నిరసనగా గోదావరిఖని ప్రధానచౌరస్తా టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా, పోలీసులు భగ్నం చేశారు. దీక్ష ప్రారంభంలోనే చందర్, నాయకులను అరెస్ట్ చేసి, మంచిర్యాల జిల్లా జైపూర్ ఠాణాకు తరలించారు. చందర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే దాకా ఎన్ని అరెస్టులు, అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రియాజ్ అహ్మద్‌ను సైతం జైపూర్ స్టేషన్‌కు తరలించారు. జూలపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, నాయకులను అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. రఘువీర్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వేల మంది నిరుద్యోగ యువతకు భృతి చెల్లిస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, హామీలు ఇచిచ ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పెద్దపల్లి బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్ లైశెట్టి భిక్షపతి, పెంచాల శ్రీధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దాడి సంతోష్, వెల్పుల రమేశ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోదుంపల్లి శ్రావణ్, ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి అశోక్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి, బసంత్‌నగర్, పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంథని నియోజకవర్గంతోపాటు జగిత్యాల జిల్లాలోనూ బీఆర్‌ఎస్ నాయకులు, ఇతర పార్టీల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

### హామీలపై ప్రశ్నిస్తే అరెస్టులా..?

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఏంటని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ దుర్మార్గపు పాలన కొనసాగిస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ప్రజావంచనకు నిరసనగా బుధవారం గోదావరిఖని టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేసి అరెస్ట్ చేయగా, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అరెస్టయినా భయపడేది లేదని, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా బీఆర్‌ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

### గ్రూప్-4 అభ్యర్థులకు అవస్థలు

సభలో గ్రూప్-4 సెలెక్ట్ అయిన అభ్యర్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఉద్యోగాలు సాధించిన 8084మందికి పెద్దపల్లి సభలో సీఎం రేవంత్ చేతులమీదుగా నియామక పత్రాలు ఇస్తామని పిలిపించి, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నరకం చూశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సుల్లో అభ్యర్థులను తరలించగా, ఉదయం 11గంటల వరకే సభకు వచ్చారు. సాయంత్రం వరకు వేచి చూశారు. సభా పరిసరాల్లో పడిగాపులు కాశారు. గ్రూప్-4 ఉద్యోగ స్టాళ్ల వద్ద ఉన్న వారికి ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో నేలపైనే కూర్చున్నారు. కానీ, సభలో 15 మందికి మాత్రమే నియామక పత్రాలు ఇవ్వడంతో మిగతావారు నిరాశ చెందారు. తరలివచ్చిన వారిలో యువతులు, కొందరు బాలింతలు, గర్భిణులు ఉండగా వారి కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో నరకం చూశారు. కనీస సౌకర్యాలు లేక పిల్లలతో వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సభ ప్రారంభమైన తర్వాత బయటికి వెళ్లేందుకు ప్రయత్నించినా అనుమతించలేదు. సీఎం, ప్రముఖుల ప్రసంగాలు పూర్తయ్యే వరకూ ఉండాలని పోలీసులు కరాకండీగా చెప్పడంతో రాత్రి 7.30గంటల వరకు కూర్చోక తప్పలేదు.



నియామక పత్రాల కోసం చంటిపిల్లలతో సభకు వచ్చిన తల్లులు

# బస్సుల్లేక తిప్పలు



కరీంనగర్‌లో బస్సులో సీట్లు కోసం పాట్లు పడుతున్న ప్రయాణికులు

- కరీంనగర్ రీజియన్‌లో మెజార్టీ బస్సులన్నీ పెద్దపల్లి సీఎం సభకే
- ప్రయాణికుల అవస్థలు

కరీంనగర్ తెలంగాణ చౌక్/ మంథని, డిసెంబర్ 4: పెద్దపల్లిలో సీఎం రేవంత్ సభ ప్రయాణికులకు పాట్లు తెచ్చిపెట్టింది. ఆర్టీసీ మెజార్టీ బస్సులను సభకు పంపించడంతో పలు రూట్లలో ఒక్క బస్సూ నడవక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని వివిధ రూట్లలో ప్రతి రోజూ 892 బస్సు సర్వీసులను నడిపిస్తుంటారు. అయితే పెద్దపల్లిలో సీఎం సభకు ప్రజలను తరలించేందుకు 429 బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించగా, కేవలం 463 బస్సులు మాత్రమే ప్రయాణికుల కోసం ఆయా రూట్లలో నడిపించారు. కొన్ని రూట్లలో అసలు బస్సులే నడవకపోగా, ఎక్కువగా రద్దీగా ఉండే రూట్లలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజువారీగా నడిచే ట్రిప్పులతో చూస్తే బుధవారం దాదాపు 1200 ట్రిప్పులు తగ్గగా, ఎక్కువగా రద్దీగా ఉండే వేములవాడ, వరంగల్ నిజామాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్ రూట్లలో గంటల తరబడి బస్టేషన్‌లో వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. వచ్చిన బస్సుల్లోనే కిక్కిరిసి వెళ్లడం కనిపించింది. రద్దీ దృష్ట్యా డిపో-2 మల్లయ్య, ఏటీఎం సురేశ్, స్టేషన్ మేనేజర్ అంజయ్య కలిసి హైదరాబాద్, కామారెడ్డి, బాన్సువాడ నుంచి 60 బస్సులను రప్పించినప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోయాయి. ఫలితంగా ముఖ్యంగా వివిధ గ్రామాల నుంచి నగరానికి వచ్చే కూరగాయల వ్యాపారులు, హాస్పిటల్, ఇతర సంస్థలో పనిచేసే వారు ఆటోలు, టాటా ఏసీ వాహనాల్లో ప్రయాణించాల్సి వచ్చింది. ఇక మంథని ఆర్టీసీ డిపో నుంచి నిత్యం నడిచే 52 బస్సు సర్వీసుల్లో సీఎం సభకు 32బస్సులను పంపించగా, కరీంనగర్, భూపాలపల్లి, గోదావరిఖని రూట్లకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు.



మంథని: బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు